


గుమాస్తా నరసింహానికి నారాయణ రావు మీద ఎంతో కసిగా ఉంది కోపంగా ఉంది పీక పిసికి చంపేద్దామన్నంత ఉక్రోషంగా ఉంది

అలా ఎందుకుందీ...ఎందుకు తను నారాయణరావంటే యింత జెలసీగా ఫీలవుతున్నాడూ అని నరసింహం ఎన్నో సార్లు తనను తాను ప్రశ్నించుకున్నాడు. కాని ఎన్నడూ జవాబు దొరకలేదు నరసింహానికి అసలు ప్రత్యేకంగా సమాధానం ఒకటుంటే గదా దొరకడానికి

నారాయణరావు తనకంటే కింద వాడు...తనకంటే చురుకైనవాడు... తనకంటే మంచివాడు తన ఆఫీసులోనే, తన ఎదురు సీట్లోనే కూర్చుని తనకంటే గుమాస్తా పనిని బహుచక్కగా నిర్వహిస్తున్నవాడు...దీపంలాంటి తన ప్రక్కన ట్యూబ్‌లైటులా ఉండి తన ఉనికిని మరుగుపరుస్తున్నవాడు

—అందుకే...అందుకే నారాయణ రావంటే తనకు ఈర్ష్య

నారాయణరావంటేనే ఆఫీసులో అందరూ లైక్ చేస్తారు అతనంటేనే ప్రతివారూ...లేడీ టైపిస్టు దగ్గర్నుండి ప్యూన్ మల్లయ్యదాకా అందరూ అభిమానిస్తారు తమ బాస్, అసిస్టెంట్ డైరక్టర్

శ్రీమతిచంద్రిక కూడా నారాయణరావంటే ఎంతో ఆదరణగా చూస్తుంది అదే తన నైతే...ప్చ్...ఒట్టి గంటిలో ఈగలా—

'నారాయణరావు నారాయణరావు'- కసిగా గొణుక్కున్నాడు నరసింహం... గొణుక్కుని ఫైల్లో రాస్తున్నవాడల్లా గంభీరంగా తలెత్తి ఎదుటి సీటువంక చూశాడు అతని ముఖం హత్య చేయ బోతున్న మనిషిముఖంలా ఎర్రగా ఉంది

నారాయణరావు ఏదో ఫైలును మూసి వేసి ప్యూన్‌ను పిలిచి దాన్ని అసిస్టెంట్ డైరక్టర్ కిమ్మని చెప్పి గబగబా బయట కెళ్ళిపోయాడు

మల్లయ్య ఫైల్‌ను చంకలో పెట్టు కుంటూండగా నరసింహం పిలిచాడు ఎంతో ఆతురతగా పిలిచి "మల్లయ్యా దాంతోపాటు నా ఫైల్‌ను కూడా మేడమ్ దగ్గరికి తీసుకెళ్లువు గాని ఓ క్షణమాగు" అన్నాడు

"మంచిదండి" — బీడీ అంటించు కుంటున్నాడు ప్యూన్, నారాయణరావు వాపసు ఫైల్‌ను నరసింహం టేబుల్‌పై పెట్టి

ఫైల్లోని నోట్‌లో చివరి వాక్యం రాస్తున్న నరసింహం కలాన్నాపేసి "మల్లయ్యా – ఈలోగా క్యాంటీన్ కెళ్ళి నా ఖాతాలో నువ్వో టీ తాగి నాకో టీ పట్టుకొస్తావా" అన్నాడు ఎంతో లోతుగా ఆలోచిస్తూ

"మంచిదండీ—"

"పో మరి."

మల్లయ్య వెళ్ళిపోయాడు.

నరసింహం ముఖంపై చెమటలు వరదలా ముంచుకొస్తున్నాయి...సెక్షన్‌లో ఎవరూ లేరు. తనొక్కడే ఎదురుగా మేడమ్ గది ముందర టేబిల్‌మీద నారాయణరావు సీట్లోని ఫైల్ — యిదే చక్కనిఅవకాశం ..చక్కని అవకాశం

చుట్టూ చూశాడు భయం భయంగా చూచి నారాయణరావు ఫైల్‌ను విప్పి, తన ఫైల్ ప్రక్కనే పెట్టి, మళ్ళీ చుట్టూ ఓ సారి కలయజూచి, డ్రాయర్‌లోనుండి ఎప్పడినుండో తను దాచి ఉంచిన కాగితాన్ని బయటకి తీసి గబుక్కున నోట్ ఫైల్ కాగితానికి పిన్ చేసి, చక చకా రెండు ఫైళ్ళ రేపర్స్‌నూ కట్టేసి... నిండుగా నిట్టూర్చి...వెనక్కి సీట్లోకి ఒరిగి 'హమ్మయ్య' అనుకున్నాడు

అలా నిశ్శబ్దంగా చూస్తూ కూర్చున్న నరసింహానికి ఎదురుగా ఉన్న రెండు ఫైళ్ళతోనూ నారాయణరావు ఫైల్ ప్రేల బోయే డైనమైట్‌లా కనిపిస్తోంది అతని గుండెలు యిక ఆగిపోతాయా అన్నంత స్పీడ్‌గా కొట్టుకుంటున్నాయి

మల్లయ్య వచ్చాడు వచ్చి టీ యిచ్చి ఫైళ్ళను తీసుకెళ్ళాడు

నరసింహం కళ్ళు బాస్ గదినే చూస్తు న్నాయి యిక జరగబోయేదంతా అతని మనసుపై పరుగెత్తే నీడలా కదులుతోంది ...ఒకవైపు సంతోషం...మరో వైపు భయం కాస్సేపయింతర్వాత నారాయణ రావు వచ్చాడు అతను ఉరికంబమెక్క బోయే ముద్దాయిలా కనిపిస్తున్నాడు నరసింహానికి

బాస్ గదిలోనుండి బజర్ మ్రోగింది. ప్యూన్ మల్లయ్య ఉరికాడు లోపలికి. ఉరికినవాడు మళ్ళీ తుఫానుగాలిలా బయటికి పరుగెత్తుకొచ్చి "మేడమ్ మిమ్మల్ని రమ్మంటున్నారాస్సార్" అన్నాడు నారాయణరావుతో.

అంతా గమనిస్తున్నాడు నరసింహం ఫైల్లో ఏదో రాస్తున్నట్టు నటిస్తూ.

నారాయణరావు పులి నోట్లోకి మేకలా... యిక మేడమ్ గదిలో వాతావరణం బ్రద్దలైపోయి ... ప్రళయం సంభవించి—దీంతో నారాయణరావు సంగతి "ఫినిష్—"

నరసింహంలో సంతోషం వరదలా ముంచుకొస్తోంది

ఒకటి...రెండు...మూడు — పది నిమిషాలైంది...వ్చ్...ఏదీ ... మేడమ్ గాండ్రించడం లేదు. నారాయణరావు బయటికి రావడంలేదు. యింకా తనను కుంటున్న బీభత్సం జరగడంలేదు.

ఏమైంది...ఏమైంది.

యింకో రెండు నిముషాల తర్వాత నారాయణరావు బయటికొచ్చాడు మేడమ్ గదిలోనుండి, ఎంతో మామూలుగా, చిరునవ్వుతో

మరి...మరి...తను పెట్టిన డైనమైట్ సంగతో — హృదయాన్ని పిసుక్కుంటున్న నరసింహానికి "మేడమ్ రమ్మంటున్నారాస్సార్" అన్న మల్లయ్య మాట వినబడింది

తనను రమ్మంటోందా...ఎందుకు... ఎందుకు...

మేడమ్ గదిలోకి వెళ్తూ నారాయణరావువంక చూశాడు నరసింహం... నారాయణరావు నిండుగా, గంభీరంగా, ట్యూబ్‌లైట్‌లా ఉన్నాడు ముఖంలో కాంతితో.

ఎదురుగా మేడమ్ ఆడపులిలా... నాల్కలు చాస్తున్న మంటలా ... అగ్నిగుండంలా—

"యూ బ్రూట్...ఏమిటిది—"

తన ఫైల్‌ను తన ముఖంకేసి కొట్టింది—

ఫైల్ చిందరవందరగా తెగిపోయి... తను పెట్టిన కాగితం ... ఎదురుగా, డియర్ చంద్రికా,

ఐ లవ్ యూ—

యువర్స్—

క్రింద పేరులేని ప్రేమలేఖ ... తనే సృష్టించిన ప్రేమలేఖ ... నారాయణరావును అపకీర్తిపాలు చేయాలని తనే రాసిన ప్రేమలేఖ—

నారాయణరావు ఫైల్‌లో పెట్టాలనుకుని తొందరలో, భయంలో, పొరపాటున కాగితాన్ని తన ఫైల్లోనే పెట్టాడా తను.

నరసింహం ముఖం కాలిపోయిన కాగితంలా నల్లగా వికారంగా తయారైంది.

"ఐయామ్ సస్పెండింగ్ యూ ఫర్ ఎ వీక్—గో" అరిచింది మేడమ్.

ఎవరో గుండెల్లో గునపాలతో పొడుస్తున్నట్టనిపించింది నరసింహానికి.

---